


**జరిగిన కథ :** పుత్రకునికి మహిమాన్వితమైన పాదుకలు, దండం, బొంతసంచి లభ్యమయ్యాయి. కోతులు ఎత్తుకుపోవడం వల్ల వాటిని పొందిన ఆనందం అంతలోనే ఆవిరైంది. ఎంతో కష్టపడి పాదుకలు, దండం తిరిగి సంపాదించాడు. బొంతసంచి రామజోగి అనే బిచ్చగాడి దగ్గర చూసి, దానిని చేజిక్కించుకునేందుకు అతణ్ని మాటల్లో పెట్టాడు. పుత్రకుడు కథ చెబుతున్నాడు. రామజోగి వింటున్నాడు.




అనుసృజన: **నేతి సూర్యనారాయణ శర్మ**

# పాటలీపుత్ర నగరం

గంపగయ్యాళి గోగునార మోకులన్నీ బండికి ఎక్కించింది. ఊరిబయట రావి చెట్టు దగ్గరికి వెళ్లింది. తన చేతుల తీట తీరేలాగా ఆ చెట్టునే భర్తగా భావించుకుని మోకులతో కొట్టసాగింది.

చాలాకాలం నుంచి ఆ రావిచెట్టును ఆశ్రయించుకుని ఒక బ్రహ్మరాక్షసుడు ఉన్నాడు. గంపగయ్యాళి చెట్టును కొడుతుంటే బ్రహ్మరాక్షసుడికి వీపు వాచిపోయింది. వాడు తట్టుకోలేక 'కుయ్యోమొర్రో!' అని అరుస్తూ ఆ చెట్టునొదిలి పరిగెత్తాడు. ఆమె దెబ్బలకు జడిసి.. పాపం తెల్లారేదాకా అలా పరిగెడుతూనే ఉన్నాడు.

అంతలో ముష్టిమూటలు నెత్తికెత్తుకుని, సానుభూతి అతనికి ఎదురొచ్చాడు. వాళ్లిద్దరూ మాటల్లో పడ్డారు.

''అయ్యా! మాది విన్నకోట అగ్రహారం'' అని చెప్పాడు సానుభూతి.

''అయ్య బాబోయ్! ఆ ఊళ్లో మా రాక్షసులకంటే బలమైన గంపగయ్యాళి ఉందయ్యా! ఆమె కొట్టిన దెబ్బలకు నా వీపు పగిలిపోయింది. ఆ ఊళ్లో నువ్వెలా ఉంటున్నావయ్యా బాబూ!'' అన్నాడు జాలిగా బ్రహ్మరాక్షసుడు.

సానుభూతి ఏడవలేక నవ్వుతూ..

''ఆ గయ్యాళి మా ఆవిడేనయ్యా! రోజూ నన్ను మోకులతో కొట్టడం ఆమెకు అలవాటు. నేను ఊళ్లో లేకపోవడం వల్ల నిన్ను బాదినట్టుంది'' అని చెప్పాడు.

''అబ్బా అబ్బా.. ఎలా తట్టుకుంటున్నావయ్యా ఆ దెబ్బలు! వాటి కోసమేనా ఏదో పుట్టి మునిగిపోయినట్టు ముష్టి మూటలెత్తుకుని మళ్లీ బయల్దేరావు'' అన్నాడు బ్రహ్మరాక్షసుడు వీపు తడుముకుంటూ.

''ఏం చేస్తాను?! ఏదో ఇంత కాచిపోస్తున్నది కదాని దెబ్బలు పడి ఊరుకుంటున్నాను. దాన్ని విడిచిపెడితే నాకు మళ్లీ పెళ్లికాదు. నేను అతి దరిద్రుణ్ని. ఏం చేయను'' అని విచారం వ్యక్తంచేశాడు సానుభూతి.

అతని మాటలు వింటుంటే దయ అనే మాటకు అర్థమే తెలియని బ్రహ్మరాక్షసుడికి బోలెడంత జాలి ముంచుకొచ్చింది.

''ఓ బ్రాహ్మణుడా! దుఃఖించకు. నేను చెప్పినట్టు చేస్తే నీకు నీ పెళ్లాం పీడ వదిలిస్తాను. ఇక్కడికి దగ్గరలో వనదుర్గమనే నగరాన్ని దుర్గాదత్తుడనే రాజు పాలిస్తున్నాడు. అతనికి ఒకతే కూతురు. నేను దానిని పడతాను. భూతవైద్యులకు లొంగకుండా ప్రాణావశిష్టను చేస్తాను. కొన్నిరోజులాగి నువ్వక్కడికి రా. భూతాన్ని వదిలిస్తానని రాజుకు చెప్పి.. నీకు కావాల్సిన భూములో, గ్రామాలో కోరుకో. నా దగ్గరికి వచ్చి, రావిచెట్టు బ్రాహ్మణుడిని వచ్చానని చెప్పు. వెంటనే నేను రాజు కూతురిని వదిలేస్తాను. దాంతో నువ్వు భాగ్యవంతుడివి కావచ్చు. మరో మంచిపిల్లను చూసి పెళ్లి చేసుకోవచ్చు'' అని చెప్పాడు.

సానుభూతి సంతోషపడి అలాగేనని ఒప్పుకొన్నాడు.

బ్రహ్మరాక్షసుడు వెంటనే వనదుర్గానికి పోయి, దుర్గాదత్తుని కూతురిని ఆవేశించాడు. దాంతో ఆమె కెవ్వుమని పెద్దకేక పెట్టి, సొమ్మసిల్లి పడిపోయింది. మెలకువ వచ్చింది మొదలు ఎవరు దగ్గరకి వచ్చినా మెడపట్టుకుని కరవబోయేది. దాంతో ఆమెను గదిలో బంధించారు. ఎందరో వైద్యులను రప్పించి, రకరకాల ప్రయోగాలు చేయించారు. కానీ ప్రయోజనం లేకపోయింది.

''రాకుమార్తెకు భూతాన్ని వదిలించిన వారికి నూరు గ్రామాలు రాసిస్తాను'' అని దుర్గాదత్తుడు ప్రకటించాడు.

అప్పుడు సానుభూతి వచ్చాడు. తాను భూతాన్ని వదిలించగలనన్నాడు. అతని వాలకం చూస్తే ఎవరికీ నమ్మబుద్ధి కాలేదు. కానీ ఎందుకైనా మంచిదని రాకుమారి ఉన్న గదిలోకి వెళ్లనిచ్చారు. అతణ్ని చూడగానే రాకుమారి అరుస్తూ మీదికి రాబోయింది.

అతను రెండు చేతులూ జోడించి..

''తండ్రీ! నేను సానుభూతిని. రావిచెట్టు బ్రాహ్మణుడిని వచ్చాను. నీవల్ల నాకు నూరు గ్రామాలు దక్కాయి'' అని పలికాడు.

అప్పుడు బ్రహ్మరాక్షసుడు రాకుమారి శరీరంనుంచి ఈవలకు వచ్చాడు.

''పారుడా! నీకోసమే ఇంతకాలమూ ఇంత అట్టహాసం చేస్తున్నాను. నీకు కావాల్సింది దొరికింది కదా! సుఖంగా ఉండు. నేనీమెను విడిచిపెట్టి పోతున్నాను. మరొక్కమాట చెబుతున్నాను ఆలకించు. బ్రహ్మరాక్షసు